సాక్షి
మంచిర్యాల
సోమవారం ¦ 18 ¦ నవంబర్ ¦ 2024



జిల్లాల్లో పారామెడికల్ కోర్సులు

పారామెడికల్ కోర్సులు అభ్యసించడానికి జిల్లాలోనే అవకాశం కలిగింది. మెడికల్ కళాశాలల్లో ఈ ఏడాది నుంచి కోర్సులు ప్రారంభించారు. 8లో▸



ఎట్టకేలకు ముందడుగు

జిల్లాలో మినీ స్టేడియం నిర్మాణానికి ఎట్టకేలకు అడుగు పడింది. సాయికుంటలోని 14 ఎకరాల్లో నిర్మించే పనులు మొదలయ్యాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.1 /15.6

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. మంచు కురుస్తుంది. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పుస్తక పఠనం- పునర్‌వైభవంపై సెమినార్



చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న పాఠకులు

మంచిర్యాలఅర్బన్: గ్రంథాలయ 57వ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయాలు–పుస్తక పఠనం – పునర్ వైభవం అనే అంశంపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా వక్తలు మాట్లాడుతూ పుస్తక పఠనం వికాసాన్ని, విజ్ఞానాన్ని అందిస్తుందన్నారు. పఠనం ద్వారా వివిధ భాషలపై పట్టు పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యక్రమంలో కవులు, స్థానికులు అల్లాడి శ్రీనివాస్, భూపతి సంతోష్, మల్లేశం, లైబ్రేరియన్లు మురళి, గోపి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

19న అతిథి ఉపాధ్యాయులకు ఇంటర్వ్యూ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, కళాశాలల్లో తాత్కాలిక పద్ధతిన విద్యాబోధన చేసే అతిథి ఉపాధ్యాయుల నియామకానికి ఈనెల 19న మంగళవారం తరగతుల డెమో, ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ సేరు శ్రీధర్ తెలిపారు. జిల్లాలోని ఎంజేపీ పాఠశాల, కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమాల్లో బోధించేందుకు తెలుగు(పీజీటీ మహిళ-1), ఇంగ్లిష్(జేఎల్ మహిళ-1), జువాలజీ(జేఎల్ మహిళ-1), సోషల్(పీజీటీ జనరల్-2, మహిళ-1) సబ్జెక్టులు బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు సబ్జెక్టులలో పోస్ట్ గ్రాడ్యుయేషన్(పీజీ), బీఈడీ పూర్తిచేసి టెట్ అర్హత కలిగి ఉన్న అభ్యర్థులు తరగతుల డెమో, ఇంటర్వ్యూలకు హాజీపూర్ మండలం గుడిపేట ఎంజేపీ పాఠశాలలో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. అభ్యర్థులు బయోడేటా, విద్యార్హతల జిరాక్స్ పత్రాలు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు.

రేపు బాక్సింగ్ పోటీలు

మంచిర్యాలఅర్బన్: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 19న హాజీపూర్ మండలం గుడిపేట మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలలో అండర్ 14, అండర్–17 బాలబాలికల జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో యాదయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఫణిరాజా తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఈనెల 19న ఉదయం 8 గంటలకు తమ వయసు ధ్రువీకరణ పత్రాలతో టోర్నమెంట్ కన్వీనర్ సేరు శ్రీధర్‌ను సంప్రదించాలన్నారు.

అలరించిన కవి సమ్మేళనం

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ హైస్కూల్‌లో జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కవిసమ్మేళనం అలరించింది. సమితి ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీరామోజు లక్ష్మీరాజయ్యకు నివాళులర్పించారు. ఆయన చేసిన సాహితీ సేవలను కొనియాడారు. 30 గ్రంథాలు రాసిన లక్ష్మీరాజయ్య జీవనయానం అనే పుస్తకంలో తన ఆత్మకథను రాశారని తెలిపారు. అనంతరం పలువురు కవితాగానం చేశారు. కవులు గణపురం సంతోష్, మల్లేశం పాల్గొన్నారు.

బీసీ సదస్సు విజయవంతం చేయాలి

పాతమంచిర్యాల: బీసీలను దెబ్బతీస్తున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఈనెల 30న నిర్వహించే బీసీ సదస్సును విజయవంతం చేయాలని బీసీ జేఏసీ నాయకులు కోరారు. జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో బీసీ సదస్సు సన్నాహక సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల వివక్షకు గురైన ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీలకు రిజర్వేషన్ ఫలాలు అందించాలని రాజ్యాంగం రిజర్వేషన్లు ప్రవేశపెడితే, దానికి భిన్నంగా అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు వచ్చాయని, అగ్రవర్ణాలకు రిజర్వేషన్ కల్పించడం వలన బీసీలు తీవ్రంగా నష్టపోతున్నారని వెల్లడించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పూర్వాపరాలు, వాటి వలన బీసీలకు జరుగుతున్న నష్టాల గురించి వివరించడానికి సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సుకు బీసీ సంఘాల రాష్ట్ర నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమానికి బీసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, పద్మశాలి సంఘం నాయకులు చలమల అంజయ్య, అఖిల, గాండ్ల తేలికుల సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ధి చంద్రమౌళి, కొండయ్య, నస్పూరి అఖిల్, రాజన్నచారి, సతీశ్ పాల్గొన్నారు.

క్వాలిటీ కాంట్రాక్టర్లకే ఎరుక!?



ఓ గురుకుల పాఠశాలలో వివిధ బ్రాండ్‌లకు చెందిన నిత్యావసర సరుకులు

- హాస్టళ్లకు నాసిరకం సరుకులు సరఫరా
- గుర్తింపు లేని కంపెనీల నుంచి కొనుగోలు
- టెండర్‌లో చెప్పిందొకటి.. సరఫరా చేసేదొకటి..
- డైట్ చార్జీలు పెరిగినా.. మారని గుత్తేదారు తీరు..



కారం పొడి ప్యాకెట్లు



అల్లం, వెల్లుల్లి పేస్ట్ డబ్బాలు

మంచిర్యాలఅర్బన్: గురుకుల విద్యార్థుల డైట్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 1న పెంచింది. తక్షణం అమలులోకి వస్తాయని ప్రకటించింది. చార్జీలు పెంచి 20 రోజులు కావొస్తున్నా.. విద్యార్థుల మెనూ మారలేదు. పెరిగిన చార్జీలకు అనుగుణంగా భోజనం క్వాలిటీ పెరగలేదు. కాంట్రాక్టర్లు గురుకులాలకు సరఫరా చేసే సరుకులూ నాసిరకంగానే ఉంటున్నాయి. ఇప్పటికే గురుకులాల్లో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కాంట్రాక్టర్లు అగ్రిమెంట్ మేరకు కాకుండా.. తమకు తక్కువ ధరకు వచ్చే కంపెనీలకు చెందిన సరుకులను సరఫరా చేస్తున్నారు. టెండర్ ఒప్పందం ప్రకారం హాస్టళ్లకు అల్లం, వెల్లుల్లి పేస్టు వేర్వేరుగా సరఫరా చేయాలి. కానీ, కాంట్రాక్టర్లు.. రెండూ కలిపి ఉండే పేస్టునే సరఫరా చేస్తున్నారు. ఇది ఎక్కువ రోజులు నిల్వ ఉండదు. వేడికి ఎండిపోతుంది. అయినా కాంట్రాక్టర్లు వీటినే సరఫరా చేస్తున్నారు. చాలా సరుకులను కాంట్రాక్టర్లు టెండర్ అగ్రిమెంట్ మేరకు సరఫరా చేయడం లేదు. దీంతో తనిఖీలకు వెళ్లిన అధికారులు గురుకులాల్లోని నాసిరకం సరుకులు చూసి ఆశ్చర్యపోతున్నారు. కొందరు అధికారులు కాంట్రాక్టర్లకు ఫోన్ చేసి వెంటనే సరుకులు మార్చాలని ఆదేశిస్తున్నారు. టెండర్ అగ్రిమెంట్‌లో పేర్కొన్న సరుకులనే సరఫరా చేయాలని సూచిస్తున్నారు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 23 వసతిగృహాల్లో 2,430, 16 బీసీ వసతి వసతిగృహాల్లో 1,645, 16 ఎస్టీ ఆశ్రమ, రెండు పోస్టు మెట్రిక్ వసతిగృహాల్లో 3,249, టీఎస్‌ఆర్ ఈఐ స్కూళ్లలో 533, నాలుగు మైనారిటీ వెల్ఫేర్ స్కూళ్లలో 922 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఎనిమిది ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ స్కూళ్లో 3,087, తొమ్మిది టీఎస్‌ఎస్‌డబ్ల్యూ ఆర్‌ఈఐ సొసైటీ స్కూళ్లలో 4,373 మంది విద్యార్థులు చదువుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం కోసం వినియోగించే సరుకుల సరఫరాలో ఇష్టారాజ్యం కొనసాగుతోంది.

డైట్ చార్జీలు పెంచినా..

నాసిరకం భోజనంతో విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటుందని, నాణ్యమైన భోజనం అందించేందుకు సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలకు డైట్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. అయినా కాంట్రాక్టర్లు వసతి, గురుకులాల నిర్వాహకుల్లో మార్పు రావటం లేదు. కాంట్రాక్టర్లు సరఫరా చేసే సరుకుల్లో నాణ్యత ఎంత అనేది ప్రశ్నార్థకంగా మారుతోంది. టెండర్‌లో అగ్రిమెంట్‌ను అతిక్రమిస్తున్నా.. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో గురుకులాలు, వసతి గృహాల్లో ఫుడ్‌పాయిజన్ ఘటనలు పెరుగుతున్నాయి.

సరుకుల సరఫరాలో గోల్‌మాల్..

గురుకులాలు, వసతి గృహాలకు సరఫరా చేసే సరుకుల్లో గోల్‌మాల్ జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తక్కువ ధరకు వచ్చే ఉప్పు నుంచి కందిపప్పు వరకు పేరు తెలియని కంపెనీల సరుకులు సరఫరా చేస్తున్నారు. టెండర్ అగ్రిమెంట్‌లో బ్రాండెడ్ సరుకుల పేర్లు చెప్పి.. సరఫరా మాత్రం కొత్త కొత్త బ్రాండ్లవి చేస్తున్నారు. ఉప్పు అన్నపూర్ణకు బదులు ఐ శక్తి, టాప్‌కుక్ గోల్డ్, కారం పొడి, పసుపు స్వస్తిక్, ఆశీర్వాద్‌కు బదులు కరణి, మాతానే సరఫరా చేస్తున్నారు, పల్లిపట్టీ జీఎస్ జెగ్గరికు బదులు రోజ్‌తో సరిపెడుతున్నారు. టైగర్ బిస్కట్ విద్యార్థులకు అందించిన సందర్భాలు తక్కువే. అల్లం, వెల్లుల్లి విడిగా సరఫరా చేయాలి. కానీ రెడీమేడ్ పేస్టు సరఫరా చేస్తున్నారు. ఇక కందిపప్పు, పెసరపప్పు, ఇడ్లీరవ్వ, అటుకులు, డాక్టర్ రవ్వ, కేసరి, పుట్నాలు నంబర్ వన్ క్వాలిటీ ఎక్కడ ఇచ్చిన సందర్భాలు లేవు. బీసీ, ఎస్సీ వసతిగృహాలకు సరఫరా చేసే టెండర్‌దారు ఒక్కడే అయినా చెల్లించే ధరలు వేర్వేరుగా ఉన్నా యి. వార్డెన్లు హాస్టళ్లలో ఉండకపోవడంతో నాసిరకం సరుకులు సరఫరా చేస్తున్నారు. ఇక రిజిస్టర్లలో రాసిన సరుకులు, అందుబాటులో ఉన్న సరకుల పరిమాణంలో తేడా ఉంటుంది.

సరుకులు మార్చాలని సూచించాం

జిల్లాలో బీసీ వసతిగృహాల్లో తనిఖీ నిర్వహించాం. అల్లం పేస్ట్ డబ్బాలు, కారం, పసుపు ప్యాకెట్లు టెండర్ నిబంధనలకు విరుద్ధంగా సరఫరా చేసినట్లు తెలిసింది. వసతిగృహాల వార్డెన్లకు, గుత్తేదారుకు సరుకులు మార్చాలని సూచించా. మెనూ తప్పకుండా పాటించాలి. నాణ్యమైన భోజనం అందించకుంటే చర్యలు తప్పవు.

– వినోద్, డీబీసీడీవో, మంచిర్యాల

నిబంధనల ప్రకారం సరఫరా చేయాలి

నెన్నెల్ హాస్టల్‌ను శనివారం తనిఖీ చేశాను. కారం ప్యాకెట్, ఉప్పు పేర్లు వేరేగా ఉన్నాయి. అగ్రిమెంట్‌లో ఉన్న బ్రాండ్‌నే సరఫరా చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించా. వాపస్ ఇవ్వమని వార్డెన్‌ను ఆదేశించాను. ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఎస్‌డబ్ల్యూవోకు సూచించాను. సరుకుల సరఫరాలో తేడా ఉంటే కాంట్రాక్టర్‌పై చర్య తీసుకుంటాం.

– రవీందర్‌రెడ్డి, ఎస్సీ డీడీ

వాపస్ తీసుకెళ్లండి..

టెండర్‌లో దక్కించుకున్న సరుకులు కాకుండా వేరే కంపెనీ సరుకులు సరఫరా చేసిన కాంట్రాక్టర్లు వాటిని వాపస్ తీసుకెళ్లాలని అధికారులు ఆదేశిస్తున్నారు. ఈమేరకు గురుకులాలు, వసతి గృహాల నిర్వాహకులు కాంట్రాక్టర్లకు ఫోన్ చేసి సమాచారం ఇస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో సరుకులు మార్చాలని పేర్కొంటున్నారు. దీంతో కొందరు కాంట్రా క్టర్లు ఆల్వా ఆయిల్‌కు బదులు.. విజయ ఆయిల్ మార్చారు. మిగతా సరుకులు మార్చడంలో తాత్సారం చేయడంతో అధికారులు వాటిని వినియోగించకుండా సొంత ఖర్చులతో బ్రాండెడ్ సరుకులు తెప్పిస్తున్నారు. ఇక కూరగాయల కొనుగోలు బాధ్యత వార్డెన్లదే. విద్యార్థులకు విజయ పాలు కాకుండా టెట్రా (నిల్వ పాలు) వాడుతున్నారు.

మందుల వివరాలు నమోదు చేయాలి

- వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ యశస్విని



కేంద్ర ఔషధ గిడ్డంగి వద్ద డాక్టర్ యశస్విని

మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు కేటాయించిన సెంట్రల్ డ్రగ్ స్టోర్(కేంద్ర ఔషధ గిడ్డంగి)కి వచ్చే మందుల వివరాలను వాటి బ్యాచ్ నంబర్ల ఆధారంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ఎక్స్‌పైరీ డేట్‌కు ముందున్న మందులను సపరేట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ యశస్విని సూచించారు. జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో ఇటీవల ఏర్పాటు చేసిన సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను ఆదివారం సందర్శించారు. ప్రభుత్వ ఆస్పత్రులకు డ్రగ్ స్టోర్ నుంచి మందులను సరఫరా చేసే సమయంలో ఆ కేంద్రం ఫార్మసిస్టుతో సమీక్ష చేసుకోవాలని సూచించారు. ఆశ కార్యకర్తలకు, ఆరోగ్య కార్యకర్తలకు వైద్య శిబిరాలకు మందులను ఇచ్చే సమయంలో ఎక్స్‌పైరీ డేట్ చూసుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మందుల నిల్వ కేంద్రంలో ఇతర వస్తువులను పెట్టొద్దని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధుల సమయంలో అవసరమయ్యేలాగా ముందుగానే మందుల నిల్వ ఉంచుకోవాలన్నారు. అన్ని జిల్లా కేంద్రాల్లో సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మందుల సరఫరాలో ఎలాంటి పొరపాట్లు చేయవద్దని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత, డీపీవో ప్రశాంతి, ఔషధ గిడ్డంగి ఇన్‌చార్జి శ్రీవాణి, ఫార్మసిస్టు చంద్రయ్య ఉన్నారు.

విద్యుత్ ఇంజినీర్ల కార్యవర్గం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్‌పీడీసీఎల్ విద్యుత్ ఇంజినీర్ల మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల కార్యవర్గాన్ని మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆ దివారం ఎన్నుకున్నారు. ప్రిసైడింగ్ అధికారిగా బానోత్ రాజన్న ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బ్రాంచ్ కార్యదర్శిగా జె.విలాస్, సహాయ కార్యదర్శిగా టి.తిరుపతి, కోశాధికారి రాసపల్లి రాంచందర్, మంచిర్యాల జిల్లా కార్యదర్శిగా శరత్ కుమార్, ఆసిఫాబాద్ జిల్లా కార్యదర్శిగా ఎండీ.ఇమ్రాన్‌ను ఎన్నుకున్నారు. ఎన్నికైన కార్యవర్గసభ్యులు ఇంజినీర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. నూతన కార్యవర్గానికి బి.రాజన్న, అసిస్టెంట్ ఇంజినీర్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయికృష్ణ, సంఘం సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.


ప్రశాంతంగా గ్రూప్–3 పరీక్షలు




జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

- ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను అనుమతించని అధికారులు
- జిల్లాలో 55 శాతమే హాజరు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో గ్రూప్–3 పరీక్షలు ఆదివారం ప్రశాంతగా ఆరంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా మంచిర్యాల, మందమర్రి, నస్పూర్, హాజీపూర్ మండలాల పరిధిలో 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 15,038 మంది అభ్యర్థులకు, 8,304 మంది అభ్యర్థులు మొదటిరోజు ఉదయం పరీక్షలకు హాజరయ్యారు. మధ్యాహ్నం రెండో పరీక్షకు 8,246 మంది హాజరయ్యారు. 55 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు తెలిపా రు. ఉదయం 9 గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతి ఇచ్చారు. 9:30 తర్వాత వ,చ్చిన వారిని అనుమతించలేదు. బయోమెట్రిక్ వేలిముద్రలు పరిశీ లించిన తర్వాతనే అనుమతించారు. షూష్, చేతి వాచ్‌లు, ఉంగరాలు తదితర వస్తువులతో వచ్చిన అభ్యర్థులను తొలగించిన తర్వాతనే లోపలికి పంపిచారు. మహిళలకు ప్రత్యేక తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మహిళా అభ్యర్థులు చేతికి మహందీ ఉండడంతో బయోమెట్రిక్ వేలిముద్రలు రాక ఇబ్బంది పడ్డారు. ఉదయం 13 మంది 9:30 తర్వాత రావడంతో అనుమతించలేదు. మధ్యాహ్నం నలుగురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వెనక్కి పంపించారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల, ప్రతిభ జూనియర్ కళాశాల, శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్‌కుమార్ దీపక్ సందర్శించారు. ఆర్‌బీహెచ్‌వీ స్కూల్, సీవీ.రామన్ డిగ్రీ కళాశాల, నస్పూర్‌లోని ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లిష్ మీడి యం స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను డీసీపీ భాస్కర్ పరిశీలించారు. జిల్లాలో మొదటి రోజు గ్రూప్–3 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని కలెక్టర్ తెలిపా రు. 48 పరీక్ష కేంద్రాల్లో 15,038 మంది అభ్యర్థులకు 8,304 మంది అభ్యర్థులు హాజరయ్యారని, రెండో పరీక్షకు 8,246 మంది హాజరయ్యారని వివరించారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీసీపీ భాస్కర్



హాజీపూర్: పరీక్ష కేంద్రం వద్ద మహిళా అభ్యర్థులు



మందమర్రి రూరల్ : ఆలస్యంగా వచ్చిన అభ్యర్థిని



కార్మెల్ స్కూల్ వద్ద ఆలస్యంగా వచ్చిన అభ్యర్థి

చలి పంజా



నెన్నెలలో చలిమంట వేసుకున్న మహిళలు

- 15.2 డిగ్రీలకు పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు
- చల్లని ఈదురు గాలులు..
- కమ్ముకుంటున్న మంచు దుప్పటి
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- చలిమంటలతో గ్రామీణుల ఉపశమనం

మంచిర్యాలఅగ్రికల్చర్: నాలుగు రోజులుగా జిల్లాలో చలిపంజా విసురుతోంది. అక్టోబర్ 28 వరకు 20 డిగ్రీలకు పైనే నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు ఆదివారం 15.2 డిగ్రీలకు పడిపోయింది. చల్లని ఈదురు గాలులకు తోడు సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు మంచుదుప్పటి పరుచుకుంటోంది. అక్టోబర్ మాసం ప్రారంభం నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో అక్కడక్కడా తేలికపాటు నుంచి మోస్తారు వర్షాలు కురిసాయి. ఆ ప్రభావంతో వారం రోజులుగా పరిస్థితి మారిపోయింది. ఒక్కసారిగా చలి వాతావరణం అలుముకుంది. వారం రోజుల క్రితం 34 నుంచి 36 డిగ్రీల మధ్య ఉన్న గరిష్ట ఉష్ణోగ్రతలు 29 నుంచి 33 డిగ్రీలకు పడిపోయాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో 12 డిగ్రీలలోపే చేరుకుంటున్నాయి. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు చలికి గజగజ వణుకుతున్నారు. చలిమంటలు వేసుకుని ఉపశమనం పొందుతున్నారు. ఉదయం 8 గంటల వరకు ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లే వారు స్వెటర్లు, జర్కిన్లు, ముఖానికి రక్షణ కవచం ధరించి వెళ్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ పంటలు దిగుబడి సమయం కావడంతో పత్తి ఏరేందుకు, వరికోతలు, పంటసూర్పిడికి వెళ్తున్న రైతులు చలికి ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం షిఫ్టుకు వెళ్లే సింగరేణి కార్మికులు, మున్సిపల్ కార్మికులు వణుకుతున్నారు. శీతాకాలం ఆరంభంలోనే చలి ఈవిధంగా ఉందంటే రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని భయపడుతున్నారు.

వీస్తున్న చల్లని గాలులు..

ఏటా డిసెంబర్, జనవరి మాసాల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉండేది. కానీ ప్రస్తుతం నవంబర్ మొదటివారం నుంచే చలి ప్రతాపం చూపిస్తోంది. ప్రజలు శ్వాసకోశ, చర్మ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. నిమోనియా, అస్తమాతో బాధపడుతున్నా వారు దగ్గు, జలుబు, జ్వరం వంటి లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.



నేపాలీలు ఏర్పాటు చేసిన స్వెటర్ దుకాణాలు



ఉదయం మంచుతో కమ్ముకున్న రహదారి

ఉన్ని వస్త్రాలకు పెరిగిన గిరాకీ

చలి సీజన్ ప్రారంభం కావడంతో నేపాలీలు పది హేను రోజుల క్రితమే జిల్లా కేంద్రంలోని ఐటీఐ క ళాశాల వద్ద, బెల్లంపల్లి, లక్సెట్టిపేట, చెన్నూర్, మందమర్రి, తదితర ప్రాంతాల్లో ఉన్ని వస్త్రాల దు కాణాలు ఏర్పాటు చేసుకున్నారు. గతేడాది కంటే కొంచెం ధర ఎక్కువగా ఉన్నా జనాలు కొనుగోలు కు వెనుకాడడం లేదు. చిన్నారులకు టోపి, ఫుల్ స్వెటర్ రూ.300 నుంచి ప్రారంభమై రూ.500 వర కు లభిస్తున్నాయి. మహిళలు, పురుషులకు సంబంధించిన జర్కిన్లు రూ.600 నుంచి మొదలు రూ.2 వేల వరకు విక్రయిస్తున్నారు. బ్లాంకెట్లు రూ.500 నుంచి ఆపై ధరలకు లభిస్తున్నాయి. జీఎస్టీ ప్రభా వంతో నేపాల్ వ్యాపారులు సైతం ఫిక్స్‌డ్ రేట్లతో బోర్డులు ఏర్పాటు చేసి విక్రయాలు సాగిస్తున్నారు.

నలభై ఏళ్లుగా వ్యాపారం..



మేము 40 ఏళ్లుగా మంచిర్యాలలో విక్రయాలు సాగిస్తున్నాం. ఏటా అక్టోబర్ నెలాఖరులో ఇక్కడి వస్తాం. నాలుగు రోజులుగా చలి పెరగడంతో విక్రయాలు సైతం పెరిగాయి. ప్యూర్ ఉలెన్ వస్త్రాలు తీసుకొస్తున్నాం. జీఎ స్టీ ప్రభావంతో ఫిక్స్‌డ్ రేట్లకే అమ్ముతున్నాం.

– టాష్, టిబెట్

ధర ఎక్కువైనా కొనక తప్పడం లేదు



నాలుగు రోజులుగా చలి బాగా పెరిగింది. స్వెటర్ లేనిదే బయటకు వెళ్లడం కష్టంగా మారింది. నేపాలీల వద్ద నాణ్యమైన స్వెటర్లు ఉంటాయని వస్తే ఫిక్స్‌డ్ రేట్లు పెట్టింన్రు. రూ.1,730తో స్వెటర్ కొనుగోలు చేశా. ధర కొంచెం ఎక్కువైనా కొనక తప్పడం లేదు.

– కొర్వెత తుకారాం, తిర్యాణి

క్లుప్తంగా

పోడుకోసం చెట్లు నరికివేత



లింగాపూర్ బీట్‌లో చెట్లు నరికివేసిన దృశ్యం

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ అటవీ బీట్ పరిధిలో 380 కంపార్ట్‌మెంట్‌లో పోడు వ్యవసాయం కోసం కొందరు వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున సుమారు ఎకరం స్థలంలో సుమారు 70 చెట్లకు పైగా నరికివేశారు. విషయం తెలుసుకున్న అటవీ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకునే లోపు వారంతా పారిపోయారు. ఈ విషయమై తాళ్లపేట ఎఫ్ఆర్వో సుష్మరావును వివరణ కోరగా అటవీ భూమిలో చెట్లు తొలగించిన విషయం వాస్తవమే, చెట్లను తొలగించినవారు దమ్మన్నపేటకు చెందిన వారిగా గుర్తించామన్నారు. వారందరికీ కౌన్సెలింగ్ ఇచ్చి అటవీ భూమిలో చెట్లను తొలగించొద్దని అవగాహన కల్పిస్తామని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



పట్టుకున్న ట్రాక్టర్లు

జన్నారం: జన్నారం అటవీ రేంజ్ ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను ఆదివారం రాత్రి పట్టుకున్నట్లు రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. పక్కా సమాచారంతోనే సిబ్బందితో నిఘా పెట్టగా ఇసుకతో మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. సెక్షన్ అధికారి రవి, బీట్ అధికారి ముజీబొద్దీన్ ఉన్నారు.

దాతలు సాయం కోసం ఎదురుచూపు



మంచంపట్టిన కిరణ్‌తో తల్లి అమృత

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన నిరుపేద యువకుడు అమంద కిరణ్ అనారోగ్యంతో మంచం పట్టాడు. కడుపు ఉబ్బసం, కాలేయం చెడిపోయి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తండ్రి శ్రీనివాస్ గత కొన్నేళ్ల క్రితం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి అమృత వంట పనులు చేస్తోంది. అప్పులు చేసి కుమారుడికి వైద్య చికిత్స అందిస్తోంది. అయినా కిరణ్ ఆరోగ్యం మెరుగుపడడం లేదు. ప్రస్తుతం చేతిలో చిల్లిగవ్వ లేక దయనీయ పరిస్థితిలో దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. దాతలు ఫోన్ పే, గూగుల్ పే నంబర్ 9550227132 నంబర్‌లో నగదు పంపించాలని కోరింది.

జిల్లాల్లో పారామెడికల్ కోర్సులు

- నిర్మల్ వైద్య కళాశాలలో డీఎంఎస్టీ, డీఈసీజీ
- మంచిర్యాలలో డీఎంఎల్‌టీ, డీఎంఎస్టీ
- ఆయా కోర్సుల్లో మొత్తం 120 సీట్లు
- 20 వరకు దరఖాస్తు గడువు



నిర్మల్ ప్రభుత్వ మెడికల్ కళాశాల

నిర్మల్‌చైన్‌గేట్/మంచిర్యాలటౌన్: అనేక వ్యాధులకు చికిత్స అందించడంలో వైద్యుల పాత్ర ఎంత కీలకమో వారికి తెర వెనుక సహకారం అందించడంలో పారా మెడికల్ సిబ్బంది పాత్ర కూడా అంతే కీలకం. అంత ప్రాముఖ్యత కలిగిన పారామెడికల్ కోర్సులను అభ్యసించడానికి జిల్లా విద్యార్థులకు అవకాశాలు అందివచ్చాయి. నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో రెండు కోర్సుల్లో ప్రవేశాలకు పారా మెడికల్ బోర్డు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ ఏడాది నుంచే డీఎంఎస్టీ, డీఈసీజీ కోర్సులు ప్రారంభం కానున్నాయి.

మెరుగవనున్న వైద్య సేవలు

పారామెడికల్ కోర్సులు ప్రారంభమైతే జిల్లా జనరల్ ఆస్పత్రిలో సేవలు మరింత మెరుగయ్యే అవకాశాలున్నాయి. ఇప్పటికే ఎంబీబీఎస్ రెండో సంవత్సరం విద్యార్థులు జిల్లా జనరల్ ఆస్పత్రికి వెళ్లాల్సి ఉంటుంది. అలాగే పారామెడికల్ కోర్సుల్లో చేరే వారు సైతం జిల్లా ఆస్పత్రిలో ప్రాక్టికల్స్‌కు వెళ్లడంతోపాటు మధ్యాహ్న సమయంలో వైద్య కళాశాలలో తరగతులకు హాజరుకావాల్సి ఉంటుంది.

ఇంటర్ పాసైన వాళ్లు అర్హులు

వైద్య సేవలు అందించేందుకు వైద్యులతోపాటు పారామెడికల్ సిబ్బందికి కూడా ప్రభుత్వం అవసరమైన వైద్య కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. పారామెడికల్‌లో మొత్తం 21 కోర్సులు ఉండగా నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ (డీఎంఎస్టీ), డిప్లొమా ఇన్ ఈసీజీ టెక్నీషియన్ (డీఈసీజీ) కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఒక్కో కోర్సులో 30 సీట్ల చొప్పున కేటాయించారు. ఈ కోర్సుల కాలవ్యవధి రెండేళ్లు. ఇంటర్ బైపీసీ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులు. అయితే బైపీసీ విద్యార్థులు లేకపోతే ఇంటర్‌లో ఇతర కోర్సులు చేసిన వారికి సైతం అవకాశం కల్పించనున్నారు. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు ఫారం, ఇతర వివరాలకు www. tgpmb. telangana. gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

మంచిర్యాలలో..

మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల 2022లో ఏర్పడగా, ఇటీవలే మూడో ఏడాదిలోకి అడుగుపెట్టింది. 100 ఎంబీబీఎస్ సీట్లతో ప్రస్తుతం 300ల మంది వైద్య విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పారా మెడికల్‌లో 21 కోర్సులు ఉన్నాయి. డీఎంఎల్టీ, డీఎంఎస్‌టీ కోర్సులు ప్రారంభించింది. డీఎంఎల్టీ (డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్)లో 30 సీట్లు, డీఎంఎస్‌టీ (డిప్లొమా ఇన్ మెడికల్ స్టెరిలైజేషన్ మేనేజ్‌మెంట్ అండ్ ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్)లో 30 సీట్లతో అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ కోర్సుల కాలవ్యవధి రెండేళ్లు. ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దరఖాస్తు ఫారం, వివరాలకు www. tgpmb. telangana. gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించడం, 040–24653519 నంబరులో సంప్రందించాలి.



మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల

దరఖాస్తు చేసుకోవాలి



నిర్మల్ వైద్య కళాశాలలో డీఎంఎస్టీ, డీఈసీజీ కోర్సులు ప్రారంభించాం. ఈ రెండు కోర్సులకు కలిపి 60 సీట్లు కేటాయించాం. ఈ కోర్సులు చేసినవారికి మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలుంటాయి. ఇంటర్ పూర్తి చేసిన అర్హులైన విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలి.

– శ్రీనివాస్, ప్రిన్సిపాల్, మెడికల్ కళాశాల, నిర్మల్

గూడెంలో కార్తిక పూజలు



సత్యనారాయణ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో కార్తిక పూజలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం భక్తులు తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకున్నారు. సుమారు 425 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు

రెండు చేతులు లేకపోయినా...

- గ్రూపు–3 పరీక్షలకు హాజరైన జాకీర్‌పాషా

కాగజ్‌నగర్‌రూరల్: అంగవైకల్యం చదువుకు ఏమాత్రం అడ్డుకాదని నిరూపిస్తున్నాడు కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్‌లోని చారిగాం ఏరియాకు చెందిన జాకీర్‌పాషా. పుట్టుకతోనే రెండు చేతులు లేకపోయినప్పటికీ పట్టుదలతో ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధించాలనే తపనతో నిరంతరం తన ప్రయత్నాలు కొనసాగిస్తున్నాడు. ఆదివారం నిర్వహించిన గ్రూపు–3 పరీక్షకు ఉత్సాహంగా హాజరై పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలోని పరీక్షా కేంద్రంలో కాలితో పరీక్ష రాశాడు. గతంలో కూడా ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల సమయంలో కూడా తన బాధ్యతగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటుహక్కును వినియోగించుకున్నాడు. అంతేకాకుండా హరితహారం కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొని కాలితో మొక్కలు నాటడం, రాయడం, పెయింటింగ్ వేయడంలాంటి కార్యకలాపాలు కొనసాగిస్తున్నాడు.



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న జాకీర్‌పాషా

జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: జీవితంపై విరక్తితో యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినిత తెలిపారు. ఆమె కథనం ప్రకారం..జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన అనుదీప్(30) ప్రైవేటు డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గతంలో ఓ యువతితో ప్రేమ వ్యవహారంలో గొడవలు జరుగగా, రైల్వేట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటనలో స్వల్పగాయాలై ప్రాణాలతో బయటపడ్డాడు. అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఎవరూ పెళ్లి చేసుకోరని మద్యానికి బానిసై ఏమి పనిచేయకుండా తిరుగుతుండేవాడు. శనివారం రాత్రి మద్యం తాగి వచ్చి ఇంట్లో ఉరేసుకున్నాడు. తల్లి ఉమ తెల్లారి చూసేసరికి చీరతో దూలానికి అనుదీప్ ఉరేసుకుని చనిపోయి ఉన్నాడు. తల్లి ఉమ ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



అనుదీప్ (ఫైల్)

పురుగుల మందు తాగి వ్యక్తి..

తాంసి: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఏఎస్సై ముంతాజ్ తెలిపారు. ఏఎస్సై కథనం ప్రకారం.. భీంపూర్ మండలం బుర్కపల్లి గ్రామానికి చెందిన కుడ్మేత రాంచందర్ (35) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఈక్రమంలో శనివారం వరుసకు సోదరుడైన వ్యక్తి ఇంటికి అతని లేని సమయంలో వెళ్లాడు. దీంతో వరుసకు సోదరుడు మందలించడంతో రాంచందర్ అవమానంగా భావించాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రాత్రి వెతికినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం మధ్యాహ్నం గుబిడిపల్లి శివారులో పురుగులమందు తాగి విగతజీవిగా పడి ఉన్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై ముంతాజ్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. మృతుడి భార్య మమత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ఆస్తి తగాదాలతోనే కొడుకుపై కత్తిదాడి

నార్నూర్: మండలంలోని గుంజాల గ్రామంలో శనివారం రాత్రి కొడుకుపై తండ్రి కత్తితో దాడి చేసిన విషయం తెలిసిందే. ఆస్తి తగాదాలతోనే కొడుకుపై తండ్రి కత్తితో దాడి చేసినట్లు సీఐ రహీం పాషా తెలిపారు. ఆయన క థనం ప్రకారం..గ్రామానికి చెందిన మెస్రం భుజంగరావుకు ముగ్గురు కొడుకులు ఉన్నా రు. నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. పెద్ద కొడుకు బాలాజీకి రంధాబాయితో పెళ్లయింది. వీరికి రెండు నెలల కుమారుడు ఉన్నాడు. ఆస్తిలో వాటా కావాలని కొన్నిరోజులుగా తండ్రి కొడుకుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికొచ్చిన తండ్రితో బాలాజీ గొడవపడ్డాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న తండ్రి ఆవేశానికి లోనై బాలాజీ కడుపులో కత్తితో పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆదిలాబాద్ రిమ్స్‌లో బాలాజీ చికిత్స పొందుతున్నాడు. తండ్రి పరారీలో ఉన్నాడు. బాధితుడి భార్య ఫిర్యాదుతో ఆదివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భయం గుప్పిట్లో గ్రామాలు

- నాగాపూర్, చాందూర్ గ్రామాల్లో పెద్దపులి సంచారం
- ఎద్దుపై దాడితో భయాందోళనలో గ్రామస్తులు



నాగాపూర్ శివారులో గుర్తించిన పులి పాదముద్రలు



పులి సంచారంతో జామ్డా సమీపంలో గుమిగూడిన గిరిజనులు

ఉట్నూర్‌రూరల్/నార్నూర్: నిర్మల్ జిల్లాకేంద్రం నుంచి సంచరిస్తూ వస్తున్న పెద్దపులి శుక్రవారం పెంబి మండలంలో గేదె, దూడపై దాడి చేసింది. శనివారం పెంబి దోందరి, చిసిచెల్మ రేంజ్ పరిధిలోని వంకతుమ్మ ప్రాంతంలో ఎద్దుపై దాడి చేసి గాయపర్చింది. అక్కడి నుంచి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం నాగాపూర్‌లో ఆదివారం కనిపించింది. ఉదయం వాకింగ్‌కు వెళ్లిన యువకులు పులిని గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. వెంటనే వారు అక్కడికి చేరుకుని నీటి కాల్వలో పులి పాదముద్రలు గుర్తించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. మధ్యాహ్నం చాందూర్ సమీపంలో రాజుల్‌గూడకు చెందిన కుమ్ర ఆనంద్‌కు చెందిన ఎద్దుపై దాడి చేసి గాయపర్చిందని స్థానికులు పేర్కొన్నారు. డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్, ఉట్నూర్ ఎఫ్ఆర్వో శిలానంద్.. నాగాపూర్, చాందూర్ గ్రామాలను సందర్శించారు. పాదముద్రలను గుర్తించి పులిగా నిర్ధారించారు. స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. చుట్టుపక్కల గ్రామస్తులను అప్రమత్తం చేశారు. రెండు రోజులపాటు పంట పొలాలకు, బయటికి వెళ్లొద్దన్నారు. పొలాల వద్ద విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయొద్దన్నారు. ప్రస్తుతం పులి..నాగాపూర్, చాందూరి మీదుగా నార్నూర్ మండలం జామడ వైపుగా వెళ్లిందని అధికారులు నిర్ధారించారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నార్నూర్, జైనూర్ మండలాల మీదుగా జోడేఘాట్ అడవులకు వెళ్లనుందని, అక్కడ ఆడపులి సంచరిస్తుందని అధికారులు పేర్కొన్నారు. పులి సంచారంతో గిరిజన గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

పులి సంచారంతో గ్రామస్తుల ఆందోళన

ఉట్నూర్, నార్నూర్ ప్రాంతంలో పులి సంచారంతో మండలంలోని జామ్డా, తాడిహత్నూర్, గుంజాల, నాగల్‌కొండ, పట్నాపూర్, మహగావ్, చోర్గావ్ గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఎఫ్ఎస్‌వో సుదర్శన్ జాదవ్ తెలిపిన వివరాలు.. ఆదివారం ఉట్నూర్ మండలంలోని నాగాపూర్ వద్ద వాకింగ్ చేస్తున్న కొందరు యువకులకు పులి కనిపించడంతో వారు భయంతో పురుగులు తీశారు. హస్నాపూర్, శంకర్‌నాయక్ తండా మీదుగా మధ్యాహ్నం నార్నూర్ మండలం జామ్డా శివారులో పశువులు మేత మేస్తుండగా పులి ఆవుపై దాడి చేసింది. కాపరి కేకలతో అక్కడి నుంచి వెళ్లిపోయిందని గ్రామస్తులు తెలిపారు. డీఎఫ్‌వో ప్రశాంత్ బాజీరావు పాటిల్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని పులి పాదముద్రలను గుర్తించారు. నార్నూర్ మండలం జామ్డా, తాడిహత్నూర్, నాగల్‌కొండ, చోర్గావ్, బాబేఝరి, సుంగాపూర్, మహగావ్ గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రెండురోజులపాటు ప్రజలు పత్తి ఏరేందుకు గాని ఇతర వ్యవసాయ పనులకు వెళ్లొద్దని సూచించారు. సోలార్ జట్కా మిషన్, కరెంట్ తీగలను ఎవరూ పెట్టవద్దన్నారు. జామ్డా నుంచి కుమురం భీం జిల్లా జైనూర్ మండలం మీదుగా కెరమెరి మండలం జోడేఘాట్ అటవీ ప్రాంతానికి పులి వెళ్లిపోతుందన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


నస్పూర్: సింగరేణిలో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతోటి నాగేశ్వర్‌రావు అన్నారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులతో కలిసి మాట్లాడారు. కొత్తగూడెంలోని సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో ఈనెల 12న లైజర్ సెల్ ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. లైజర్ సెల్ ద్వారా ఎస్సీ ఎస్టీ, మైనార్టీ మహిళా కార్మికుల సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందన్నారు. దీని ఏర్పాటుకు సహకరించిన ఎస్సీ ఎస్టీ మిషన్‌కు, సింగరేణి సీఎండీ బలరాం తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ కార్మిక సంఘం ఒకటే ఉందన్నారు. ఎవరు ఎలాంటి ప్రకటనలు చేసినా కార్మికులు అయోమయానికి గురికావొద్దన్నారు. త్వరలో అన్ని ఏరియాల్లో పర్యటించి కార్మికుల సమస్యలు తెలుసుకుంటామన్నారు. సమావేశంలో ఇరావుల శ్రీనివాస్ సెంట్రల్ కమిటీ మెంబర్, డేగల ప్రవీణ్‌కుమార్ వైస్ ప్రెసిడెంట్, నాయకులు అంద వెంకట్, లక్ష్మణ్, వేల్పుల ప్రవీణ్, వాసు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

మహారాష్ట్రలో ఏపీ డిప్యూటీ సీఎం ప్రచారం

ఆసిఫాబాద్: మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లా బల్లార్షా బీజేపీ అభ్యర్థి సుధీర్ మునిగంటివార్ తరఫున ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. బల్లార్షాలో తెలుగు ఓటర్లు ఉండడంతో ఇక్కడి నాయకులు పాల్గొన్నారు. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, పార్టీ రాష్ట్ర నాయకులు బోనగిరి సతీశ్‌బాబు, బీజేవైఎం రాష్ట్ర అధికారి ప్రతినిధి ఎలగతి సుచిత్, శ్రావణ్‌గౌడ్, ఇగురపు సంజీవ్, జిల్లా నాయకులు ఉన్నారు.



ప్రచారంలో పవన్‌కల్యాణ్‌తో నాయకులు

గిరిజనుడిని చితకబాదిన అధికారులు



గిరిజన సంఘం నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రవీందర్

- రామలక్ష్మణుల గుట్ట వద్ద ఘటన
- పోలీస్‌స్టేషన్‌లో ఇరువర్గాల ఫిర్యాదు

వేమనపల్లి: గిరిజనుడిని అటవీ అధికారులు చితకబాదిన ఘటన మండలంలోని సుంపుటం అటవీ ప్రాంతంలోని రామలక్ష్మణుల గుట్ట వద్ద చోటుచేసుకుంది. బాధితుడు, కళ్లంపల్లి గ్రామానికి చెందిన గిరిజనుడు కుర్సం రవీందర్ తెలిపిన వివరాలు.. ఈనెల 15న తన బావ ఆత్రం బక్కయ్యతో కలిసి రామలక్ష్మణుల గుట్ట వద్దకు చీపురు సేకరణ కోసం వెళ్లాను. అక్కడే ఉన్న తిరుమాను చెట్లకు లక్క ఉండటంతో చెట్టును నరికి సేకరించారు. సమాచారం అందుకున్న ఎఫ్ఎస్ఓ బేగ్, వేమనపల్లి ఎఫ్‌బీవో సోఫియాబేగం భర్త పాషా అక్కడికి వెళ్లారు. అధికారులను చూసి బక్కయ్య పరుగెత్తగా రవీందర్‌ను అదుపులోకి తీసుకుని కొట్టారు. బైక్‌పై కుశ్నపల్లి అటవీ కార్యాలయానికి తరలించి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని బాధితుడు తెలిపాడు. ఆదివారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం, మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేశంలతో కలిసి నీల్వాయి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



అధికారుల దాడిలో గాయపడిన రవీందర్

ఎలాంటి దాడి చేయలేదు

కళ్లంపల్లి గ్రామస్తులు గతేడాదిగా లక్క సేకరణ కోసం చెట్లను నరుకుతున్నారు. 15న అటవీ ప్రాంతానికి వెళ్లిన తమను చూసి అందరూ పరారయ్యారు. రవీందర్ పరుగెత్తగా కిందపడగా గాయాలయ్యాయి. అతడిపై దాడికి చేయలేదు. కేసు పెడతారనే నెపంతో దాడి చేసినట్లు వారు ఆరోపణ చేస్తున్నారు. కాగా, వేమనపల్లిలో తాను అద్దెకు ఉంటున్న ఇంటి వద్దకు వచ్చి కళ్లంపల్లి గ్రామస్తులు దాడికి యత్నించారని ఎఫ్‌బీఓ సోఫియాబేగం డీఆర్వో రూపేష్, భర్త పాషాతో కలిసి నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

– బేగ్, ఎఫ్ఎస్ఓ